



విత్తనాలను విత్తుతున్న రైతు కూలీలు(ఫైల్)



● పంటపొలాన్ని చదును చేస్తున్న రైతులు (ఫైల్)

పంట రుణాలపై.. పట్టింపేదీ?

- జిల్లాలో పంట రుణాలు చెల్లించాలా? వద్దా? అంటున్న రైతులు
- ఆగస్టు 15వ తేదీ లోపు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- గడువు సమయం ముగియడంతో బ్యాంకర్ల ఒత్తిళ్లు
- పంట రుణాల చెల్లింపునకు అన్నదాతల ఊగిసలాట
- సమీపిస్తున్న వానా కాలం సీజన్
- పంటల సాగుకు పెట్టుబడుల కోసం రైతుల వెతుకులాట
- కొత్త రుణాల కోసం రైతులకు తప్పని ఎదురుచూపులు
- జిల్లావ్యాప్తంగా మొత్తం లక్షా 47 వేల మంది రైతులు

ఆదిలాబాద్, మే 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పంట రుణాల చెల్లింపుల విషయంలో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మరో పక్షం రోజుల్లో వానా కాలం సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉండడంతో పెట్టుబడి ఖర్చుల కోసం బ్యాంకుల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఆగస్టు 15లోపు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీని చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే ప్రకటించడం తో అన్నదాతలు ఆశగా ఎదురు చూస్తున్నారు. దీంతో పంట రుణాలు చెల్లించాలా? వద్దా? అనే ఆలోచనతో రైతులు ఉన్నారు. అయితే పంట రుణాలు చెల్లించే గడువు సమయం ముగియడంతో బ్యాంకర్లు ఒత్తిళ్లు చేస్తున్నారు. మే మాసంలోనే పంట రుణాలను రెన్యూవల్ చేసుకుంటే కొత్త రుణాలను తీసుకునే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీపై స్పష్టతనిచ్చినా.. బ్యాంకర్లు మాత్రం పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. సీఎం ప్రకటించినట్లుగా గడువు సమయంలోపే ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందా? లేదా? లేదంటే గత ప్రభుత్వం మాదిరిగానే దాట వేస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రూ.లక్ష లోపు రుణాలను మాఫీ చేశారు. తాజాగా లోక్‌సభ ఎన్నికలకు ముందు రూ.2లక్షల వరకు మాఫీ చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడంతో అన్నదాతలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. జిల్లాలో మొత్తం లక్షా 47 వేల మంది రైతులు ఉన్నారు. ఇందులో గతేడు వరకు లక్ష 25వేల మంది రైతులు పంట రుణాలను తీసుకున్నట్లు తెలుస్తుంది. అయితే రుణమాఫీపై ప్రభుత్వం విధివిధానాలను ఇంకా ప్రకటించక పోవడంతో గందరగోళ పరిస్థితులకు దారి తీస్తుంది. ప్రభుత్వం స్పష్టతనివ్వక ముందే రుణం చెల్లిస్తే మాఫీ వర్తిస్తుందో? లేదో?నన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి సందిగ్ధ పరిస్థితులతో వానకాల పంటల సీజన్ పై ప్రభావం పడే అవకాశం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గడువులోగా చెల్లిస్తేనే..

ప్రతియేటా ఏప్రిల్, మే మాసాలలోనే రైతులు పంట రుణాలను చెల్లించి తమ ఖాతాలను రెన్యూవల్ చేసుకుంటారు. అవసరమైన రైతులు అదనపు రుణంతో పాటు కొత్త రుణాలను తీసుకుంటారు. అయితే ఈ యేడు పంట రుణాల చెల్లింపుల్లో కొంత జాప్యం జరుగుతూ వస్తుంది. ఎందుకంటే ప్రభుత్వం ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో అప్పటి వరకు వేచి చూసే ధోరణితో రైతులు కనిపిస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఏ నలుగురు కలిసినా.. పంట రుణాల మాఫీ పైననే చర్చించుకుంటున్నారు. పంట రుణం తీసుకున్న గడువు సమయం ముగిసి పోవడంతో సంబంధిత బ్యాంకర్ల నుంచి అన్నదాతలపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. రుణాలను సకాలంలో చెల్లించాలంటూ బ్యాంక్ అధికారులు ఆదేశిస్తున్నారు. కనీసం వడ్డీ చెల్లించైనా రుణ సొమ్మును రెన్యూవల్ చేసుకోవాలని సూచిస్తున్నారు. రుణం తీసుకున్న రోజు నుంచి సంవత్సరం గడువులోగా చెల్లిస్తే తక్కువ వడ్డీని చెల్లించాల్సి ఉంటుంది. ఆ తర్వాత అదనంగా వడ్డీ భారం పడే అవకాశం ఉంది. మరింత ఆలస్యమైతే వడ్డీ భారం పెరిగి పోతుందని అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు.

రుణాల చెల్లింపు పై తర్జనభర్జన

వానాకాలం పంటల సాగుకు కొంతమంది రైతులు విత్తనాలను సమకూర్చుకుని పంట చేన్లను సిద్ధం చేసుకుంటున్నారు. అయితే పంట రుణాల కోసం బ్యాంకులకు వెళ్తే ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాలేదని అధికారులు చెబు తున్నారు. దీంతో ప్రభుత్వ మార్గదర్శకాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. రుణాలను రెన్యూవల్ చేసేందుకు రైతులు వెనుకాడుతున్నారు. గతంలో ఒక కుటుంబంలో ఒకరికి మాత్రమే లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేశారు. ఈసారి నిబంధనలు ఎలా ఉంటాయోనన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రైతుల అనుమానాలను నివృత్తం చేయకపోవడంతో తర్జన భర్జన పడుతున్నారు. ఇక నైనా ప్రభుత్వం రుణ మాఫీపై గందరగోళ పరిస్థితులకు తెరదించుతేనే సాగు పనులు సాఫీగా ముందుకు సాగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ముంచుకొస్తున్న ఖరీఫ్ కాలం

జిల్లాలో మరో వారం రోజుల్లోనే వానకాల పంటల సాగు సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉంది. నీటి వసతి ఉన్న రైతులు నైరుతికి ముందుగానే పత్తి, సోయా పంటలను సాగు చేస్తారు. కొత్త పంట రుణాల కోసం అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు. ఇప్పటికే అప్పు చేసి విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసిన రైతులు పంట రుణాల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. రుణం రాగానే అప్పు తీరుస్తామంటూ వడ్డీ వ్యాపారుల నుంచి అధిక వడ్డీకి అప్పులు తీసుకుంటున్నారు. కొందరు రైతులైతే బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి మరీ పెట్టుబడులు పెడుతున్నారు. అప్పు చేసే స్తోమత లేని చిన్న, సన్నాకారు రైతులు మాత్రం రుణం వచ్చే వరకు సాగు పనుల జోలికి వెళ్లడం లేదు. సకాలంలో రుణం చేతికి వస్తేనే సాగు పనులు ఊపందుకుంటాయని లేనిపక్షంలో అదునుదాటి పోతే అసలుకే మోసం వస్తుందని రైతులు పేర్కొం టున్నారు. పంట రుణాలను రెన్యూవల్ చేసుకోక పోవడంతో బ్యాంకర్లు కొత్తగా రుణాలను మంజూరు చేయడం లేదు. దీంతో పెట్టుబడి ఖర్చుల కోసం రైతులకు వెతుకులాట తప్పడం లేదు.



కొత్త రుణాలు తీసుకునే వారికి ఇబ్బందేమీ లేదు

: చంద్రశేఖర్, లీడ్ బ్యాంక్ మేనేజర్, ఆదిలాబాద్

ప్రభుత్వం ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. కొత్త రుణాలు తీసుకునే వారికి ఎలాంటి ఇబ్బందులు ఉండవు. అవసరమైన డాక్యుమెంట్‌లను బ్యాంకు అధికారులకు అందించి రుణం తీసుకోవచ్చు. రెన్యూవల్ చేసుకునే రైతుల్లోనే కొన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విది విధానాలు ఖరారైతేనే స్పష్టత వస్తుంది. ఎప్పటి నుంచి కటాఫ్ ఉంటుందో తెలియదు. సకాలంలో రుణం చెల్లించిన రుణమాఫీకి ఇబ్బందులు ఉండవు.

సంక్షిప్త సమాచారం



ధాన్యం కొనుగోలు చేస్తున్న దృశ్యం

1,470 క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు

ఉట్నూర్, మే 15: మండలంలోని శాంతినగర్ గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో 1,470 క్వింటాళ్లు ఏ-గ్రేడ్ రకం ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.2203తో కొనుగోలు చేశామని, ఇప్పటి వరకు రూ.32.38లక్షల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల ఆదేశాల మేరకు గంగన్నపేట సమీపంలోని రైస్‌మిల్ వద్ద వరి ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మండలంలోని ఉట్నూర్, దంతనపల్లి, గంగన్నపేట, బీర్సాయిపేట ప్రాంతాల రైతులు వరి ధాన్యం విక్రయిస్తున్నారని నిర్వాహణదారుడు గట్కు రమేష్ తెలిపారు. వర్షాలకు ధాన్యం తడిచిపోకుండా ఉండడానికి తాటిపత్రిలు కప్పి భద్రపరిచామని, అధికారులు బుధవారం లారీ పంపించడంతో లారీలో ధాన్యం పంపించామని వివరించారు. అలాగే రైతుల సొమ్ము వారి బ్యాంకు ఖాతాలో నేరుగా జమ చేయడం జరుగుతుందన్నారు.

నేడు యథావిధిగా జొన్న కొనుగోళ్లు

జైనథ్, మే 15: జైనథ్ మండల కేంద్రంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయ ఆవరణలో జరుగుతున్న జొన్న కొనుగోళ్లు యథావిధిగా ఉంటుందని జైనథ్ సహకార సంఘం ముఖ్య కార్యనిర్వహణాధికారి జి.గంగన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, గురువారం జైనథ్ మండలంలోని నిరాల, నిజాంపూర్ గ్రామాలతో పాటు బేల మండలంలోని అవల్‌పూర్ గ్రామ రైతులు జొన్న పంట దిగుబడులను తీసుకురావాలని కోరారు. ఈ జొన్న పంట కొనుగోలుకు సంబంధించిన అంశాన్ని జైనథ్ బేల మండలాల ప్రజలు రైతులు సహకరించాలని జైనథ్ సీఈవో గంగన్న పేర్కొన్నారు.

అధికారులు, నాయకుల సహకారంతో మండలాభివృద్ధి : ఎంపీపీ

నేరడిగొండ, మే 15: అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో గడిచిన ఐదు సంవత్సరాలు మండలాన్ని అభివృద్ధిబాటలో నడిపామని ఎంపీపీ రాథోడ్ సజన్ అన్నారు. బుధవారం మండల సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ సంతోష్‌రెడ్డి, ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఎంఈవో భూమారెడ్డి, ప్రత్యేకాధికారులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ రాథోడ్‌సజన్

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

● ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ● ఉమ్రిలో గౌతమబుద్ధుడు, అంబేద్కర్ జయంతి ఉత్సవాలు ● పాల్గొన్న దళిత సంఘాల నాయకులు

ఉట్నూర్, మే 15: డా.బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు.ఉట్నూర్ మండలంలోని ఉమ్రి గ్రామంలో జరిగిన గౌతమబుద్ధుడు, అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు.ముందుగా బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్ దళితులు, ఆదివాసీ గిరిజనుల, సంస్కృతీ సంప్రదాయాలను దెబ్బతీసే కుట్ర పన్నుతోందని ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ,బీసీ, మైనార్టీలంతా కలిసి కట్టుగా ఉండి ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, ఆ రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత మనపై ఎంతైనా ఉందన్నారు. అంబేద్కర్ దయవల్లే తాను ఎమ్మెల్యే అయ్యానని పేర్కొన్నారు. యువత బుద్ధుడు, అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని వారు చూపిన బాటలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ, కుడిమేత వికాస్, దళిత సంఘాల నాయకులు భారత్ వాఘ్మారే దళిత, బహుజన సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ఉమ్రిలో అంబేద్కర్, బుద్ధుడు చిత్రపటాలకు నివాళ్లర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

● కష్టపడ్డ వారికి గుర్తింపు

ఉట్నూర్: పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డ ప్రతీ ఒక్క కార్యకర్తకు పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందని ఖానాపూర్ నియోజక వర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొజ్జు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం రాత్రింబవళ్లు కష్టపడి ఆరు గ్యారంటీలతో పాటు ఐదు న్యాయాలను గడపగడపకూ వెళ్లి ప్రచారం చేసిన ప్రతీఒక్క కార్యకర్తకు పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పు మేరకు ఈ పార్లమెంట్ ఎన్నికలలో ఆదిలాబాద్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండాయే ఎగరబోతుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, మండల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లిలో ఈదురుగాలుల వర్షం

● పలుచోట్ల ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు, రేకులు ● బోథ్‌లో గంటపాటు జోరువాన ● ఆగమాగమైన జొన్నరైతులు

ఇంద్రవెల్లి, మే 15: మండలంలోని మారుమూల గ్రామాలైన డొంగర్‌గమ్, భీంజితండా, హరాపూర్, మారుతిగూడ, పడగామ్, పాటగూడ, అంద్‌గూడ, పాకిడిగూడ, మోడిగూడ, పొల్లుగూడ, వాల్గొండ, తదితర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం బీభత్సం సృష్టించింది. మండలంలోని భీంజితాండ గ్రామానికి చెందిన పలువురి ఇళ్ల పైకప్పులు, రేకులు ఎగిరపోయాయి. రేకులు ఉడిపోవడంతో వర్షపు నీటితో ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు, ఇతర వస్తువులు తడిసిపోయాయి. ఈదురుగాలులతో కూడిన వర్షం కారణంంగా ఇంటి పైకప్పులు ఊడిపోయిన ఇళ్లను పరిశీలించి పరిహారం అందించాలని ఆయా గ్రామాల్లోని బాధితులు కోరారు.



బోథ్‌లో జొన్నలపై పారిని కప్పుతున్న రైతులు

● బోథ్‌లో గంట పాటు భారీ వర్షం

బోథ్: మండలంలో బుధవారం సాయంత్రం పూట కురిసిన భారీ వర్షంతో జొన్న పంటను మార్కెట్‌కు తీసుకువచ్చిన రైతులు అతలాకుతలమయ్యారు. ఈదురు గాలులతో పాటు భారీ వర్షం కురవడంతో రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చిన జొన్నలపైన కప్పిన పారిలు లేచిపోయాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందుల పాలయ్యారు. మరో వైపు రైతులు మార్కెట్ షెడ్‌లో వేసవి జొన్న పంటపై పారీలు కప్పి వాటిపైన గాలికి లేవకుండా కూర్చున్నారు. ఆకస్మికంగా కురిసిన వర్షంతో చేతికి వచ్చిన జొన్న పంట నష్టపోయే ఆస్కారం ఉందని రైతులు ఆందోళన చేస్తున్నారు.



డొంగర్‌గమ్‌లో ఇంట్లో నుంచి వర్షపు నీటిని తొలగిస్తున్న మహిళ



భీంజితండాలో పైకి లేచిన రేకులను సరి చేస్తున్న గిరిజనులు



గురుకుల కళాశాల సిబ్బందితో మాట్లాడుతున్న జల వనరుల సంరక్షణ విభాగం అధికారులు

గురుకుల పాఠశాలను సందర్శించిన జల వనరుల సంరక్షణ బృందం

బోథ్, మే 15: జాతీయ స్థాయిలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఎంపిక కావడంతో బుధవారం హైదరాబాద్ నుంచి పరిశీలన బృందం పాఠశాలకు రావడం జరిగింది. నీటి సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలు నీటి పునర్వినియోగం పద్ధతులు ఏ విధంగా చేస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అంతేగాక అందుకోసం నిర్మించిన నిర్మాణాలను పరిశీలించడంతో పాటు వర్మీ కంపోస్టు తయారీ వర్షపు నీరు హార్వేస్టింగ్ పద్ధతులను క్షుణ్ణంగా పరిశీలించారు. మరో వైపు పాఠశాలలో పరిశీలించడం జరిగింది. ఇందుకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. పరిశీలన బృందంలో సైంటిస్టులు ఉపేందర్, ఇంజనీరు కృతికతో పాటు ఎంపీడీవో ఎల్.రమేష్, ఏపీవో జగదేవరావు, ప్లాంటేషన్ సూపర్ వైజర్ సూర్య ప్రకాష్, పాఠశాల ఉపాధ్యాయులు సంతోష్, శ్రీనివాస్‌లు ఉన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ విధానాలపై ప్రజల్లో అసంతృప్తి : మాజీ మంత్రి రామన్న

ఆదిలాబాద్ అర్బన్, మే 15: లోక్‌సభ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థి ఆత్రం సక్కు భారీ మెజార్టీతో విజయం సాధించనున్నారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి జోగు రామన్న ధీమా వ్యక్తం చేశారు. బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ప్రచారం ప్రారంభమైనప్పటి నుంచి పార్టీ శ్రేణులంతా క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటించారని, నిద్రాహారాలు మాని గెలుపు కోసం కష్టపడ్డ వారందరికి ధన్యవాదాలు తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విధానాల పై ప్రజలు తీవ్ర అసంతృప్తితోఉన్నారని అన్నారు. తమ ప్రభుత్వ హయంలో పది లక్షలకు పైగా మంది లబ్దిదారులు వివిధ పథకాల ఫలాలు పొందారని తెలిపారు. వారిలో ఎక్కువ శాతం మంది కారు గుర్తుకే ఓటు వేశారని, సైలెంట్ వోటింగ్ పెద్ద ఎత్తున జరగడంతో బీఆర్‌ఎస్ సునాయాసంగా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు డబ్బులు ఆశచూపిన ప్రజలు తమవైపే ఉన్నారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమైనందున ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, రైతుబంధు, రైతుభీమా, కళ్యాణలక్ష్మి, పెన్షన్ల పంపిణీ పథకాల అమలులో ప్రభుత్వం విఫలమైందన్నారు. కేంద్రంలోని బీజేపీతోను ఆదిలాబాద్ ఎటువంటి అభివృద్ధి జరగలేదని, కాంగ్రెస్, బీజేపీల పై ఉన్న వ్యతిరేకత తమకు సానుకూలంగా మారిందని విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అజయ్, రోకండ్ల రమేష్, సాజిదొద్దిన్, మెట్టు ప్రహ్లాద్, ఇజ్జగిరి నారాయణ, కుమ్రరాజు, భూమన్న, పర్వీన్‌ఫెరోజ్, జోహర్‌బాయ్, నవాతే శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

ఘనంగా నది హారతి పూజ

● కుటుంబ సమేతంగా పాల్గొన్న భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

బాసర, మే, 15 : బాసర గోదావరి నదిలో బుధవారం నది హారతి పూజ సరస్వతీ దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య గోదారమ్మకు వివిధ పూజా కార్యక్రమాలను జరిపారు. గంటపాటు వేద మంత్రాలతో నదీతీరం ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంది. దేవాదాయ శాఖ అధికారులతో ప్రతి బుధవారం దేవస్థానం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం గత కొన్ని వారాల నుంచి కొనసాగుతుంది. బుధవారం భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ కుటుంబ సభ్యులతో కలిసి హారతిపూజలో పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంతకుముందు ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఈవో విజయరామారావు, సీఐ మల్లేషం, ఎస్సై గణేష్, తదితరులు పాల్గొన్నారు.


గోదావరి హారతి పూజలో పాల్గొన్న భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం

● తడిసిపోతున్న ధాన్యం ● కలవర పడుతున్న రైతులు



దిలావర్‌పూర్‌లో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు

దిలావర్‌పూర్, మే 15 : అకాలవర్షాలు అన్నదాతలకు శాపంగా మారాయి. కష్టపడి పండించిన పంటలను అమ్ముకునే సమయంలో అకాల వర్షాలు దెబ్బతీస్తున్నాయి. ఆరు నెలలుగా ఎన్నో ఇబ్బందులకోర్చి పండించిన పంటలు అర గంటలోనే అకాల వర్షానికి తుడిచిపెట్టుకుపోవడం రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

ధాన్యం కాపాడుకునేందుకు తంటాలు

పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు తరలించి కుప్పలుగా పోశారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేస్తూ ధాన్యాన్ని తరలిస్తున్నారు. ఇంకా తూకం వేయని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కుప్పలుగా ఉన్నాయి. తాజాగా మంగళవారం రాత్రి బలమైన గాలితో కురిసిన భారీవర్షంతో ధాన్యం తడిసిపోయింది. ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు చేసిన ప్రయత్నాలకు గాలి దుమారం గండి కొటింది. బలమైన గాలులకు టార్పాలిన్లు లేచిపోయాయి. ఉరుములు, మెరుపులు గర్జిస్తున్నా రైతులు ప్రాణాలు లెక్కచేయకుండా ధాన్యం కాపాడుకునేందుకు చేసిన ప్రయత్నం బెడిసికొట్టింది. ధాన్యం తడిసింది. రైతులు కష్టం నీటి పాలైంది. మంగళవారం రాత్రి నిర్మల్ జిల్లాలో 6.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా దిలావర్‌పూర్ మండలంలో 24 మిల్లీ మీటర్ల వర్షం కురియగా, అత్యల్పంగా 0.2 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

నిర్మల్ జిల్లాలో వాతావరణం రైతులను తికమక పెడుతోంది. ఎప్పుడు వర్షం కురుస్తోందో... ఎప్పుడు ఎండ ఉంటుందో తెలియక రైతులు పరేషాన్ అవుతున్నారు. పొద్దంతా తీవ్రమైన ఎండ కాస్తుండగా రాత్రి వేళల్లో అకస్మాత్తుగా కురిసి రైతులను నష్ట పరుస్తోంది. రైతులు అప్రమత్తంగా ఉంటూ ధాన్యంపై టార్పాలిన్లు కప్పినప్పటికీ గాలి దుమారం దెబ్బతీస్తోంది. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. ఇటీవల జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కొనుగోలు కేంద్రాలను సందర్శించి నిర్వాహకులకు స్పష్టంగా ఆదేశించారు.

ఆందోళనలో రైతులు

సారంగాపూర్ : మండలంలోని స్వర్ణ, కౌట్ల, జామ్, ధని, చించోలి(బి) గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం అకాల వర్షం కురిసింది. దీంతో మొక్కజొన్న, నువ్వు, వరి పంటలకు నష్టం వాటిల్లింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు చేతికి వచ్చిన సమయంలో అకాల వర్షం కురియడంతో నేలకొరిగాయి. పంట పొలాల నుంచి ఇంటికి తీసుకవచ్చే సమయంలో కురిసిన అకాల వర్షానికి పంటలకు నష్టం వాటిల్లడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముథోల్ : మండల కేంద్రమైన ముథోల్‌తో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి ఈదురుగాలులతో కూడిన అకాలవర్షం కురిసింది. ఈ వర్షానికి ధాన్యం తడిసింది. రైతులు పండించిన వరి ధాన్యాన్ని కల్లంలో ఆరబెట్టారు. అయితే ఈ అకాల వర్షం కారణంగా ధాన్యం తడిసిపోయింది. అంతేకాకుండా ఈదురు గాలులతో కూడిన వర్షం పడటం మూలంగా కొన్నిచోట్ల నేలకొరిగాయి. ఈ వర్షం కారణంగా వరి రైతులు ఆందోళనకు గురయ్యారు.


సారంగాపూర్‌లో కురుస్తున్న రాళ్ల వర్షం


ముథోల్ మండలంలో అకాల వర్షానికి తడిసిన ధాన్యం

రోడ్డు కోసం అడవిబిడ్డల ఎదురుచూపు

● రోడ్డు వేసే వరకు ఎన్నికల్లో పాల్గొనబోమంటూ అడవి బిడ్డల ఆవేదన ● గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ అన్ని పార్టీల అభ్యర్థుల ముందు రోడ్డు సమస్య ప్రస్తావన ● అయినా ఇప్పటికీ దక్కని పరిష్కారం ● దీంతో ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఒక అడుగు ముందుకేసి ఎన్నికల బహిష్కరణ ●ఎట్టకేలకు దిగి వచ్చిన పాలకులు ● అల్లంపెల్లి, బాబా నాయక్ తండా గ్రామస్తులతో చర్చలు ● ఎన్నికల్లో పాల్గొనాలని కచ్చితంగా సమస్యలు పరిష్కరిస్తామని జిల్లా అధికార యంత్రాంగం హామీ


మే 13వ తేదీన పార్లమెంట్ ఎన్నికల్లో బహిష్కరించి ఒకచోట సమావేశమైన అల్లంపెల్లి గ్రామస్థులు (ఫైల్)


గ్రామస్థులతో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్ (ఫైల్)

ఖానాపూర్, మే 15 : ఏళ్ల తరబడి అదే సమస్యపై వచ్చిన అధికారులకు, పాలకులకు వినతి పత్రాలు ఇచ్చి తమ గోడు వెళ్లబోసుకొని అలసిపోయిన అడవి బిడ్డలు చివరకు తిరుగుబాటు అస్త్రాన్ని ఎంచుకోవడంతో వారి సమస్య మరోసారి వెలుగులోకి వచ్చింది. అభివృద్ధిలో దూసుకుపోతున్నామని ఏళ్ల తరబడి ప్రభుత్వాలు చేసుకుంటున్న ప్రచారాలు కేవలం ఆర్భాటాలే తప్పా ఆచరణకు నోచుకోవడం లేదని అక్కడక్కడ వెలుగులోకి వస్తున్న సంఘటనలు సగటు మానవుడిని ఆలోచింపజేసేలా ఉంటున్నాయి. సమస్య వెలుగులోకి వచ్చినప్పుడు మాత్రమే స్పందిస్తున్న పాలకులు తిరిగి ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా మాత్రం ఆలోచనలు చేయడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. నిర్మల్ జిల్లా కడెం మండలంలోని పలు మారుమూల గ్రామాల పరిస్థితి కూడా ప్రస్తుతం అదే కోవలోకి వస్తుందని చెబుతున్నారు. ఈ మారుమూల గ్రామాలకు కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధికారులకు తమ సమస్యలు చెప్పి చెప్పి విసిగి వేసారిన అడవి బిడ్డలు ఇక ఏకంగా ప్రభుత్వంపై తిరుగుబాటు అస్త్రాన్ని ప్రదర్శించారు. దీంతో ఎట్టకేలకు జిల్లా అధికార యంత్రాంగం దిగివచ్చి అడవి బిడ్డల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇవ్వడంతో వారిలో మరోసారి సమస్య పరిష్కారంపై ఆశలు చిగురిస్తున్నట్లు చెబుతున్నారు. ఈసారైనా తమ సమస్యలకు పరిష్కారం దక్కేనా అని అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు ఆశగా చూస్తున్నారు.

అడవి బిడ్డల తిరుగుబాటుతో దిగివచ్చిన పాలకులు...

తమకు రోడ్డు వేయాలని రోడ్డు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు అధికారులకు చెప్పి విసిగిపోయిన కడెం మండలంలోని అల్లంపెల్లి, బాబానాయక్ తండా గ్రామస్తులు ఎట్టకేలకు ప్రభుత్వంపై తిరుగుబాటు అస్త్రాన్ని ప్రయోగించారు. ఈ నెల 13వ తేదీన జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో తాము ఓటు వేయబోమని కడెం మండలంలోని అల్లంపెల్లి, బాబా నాయక్ తండా గ్రామస్తులు ఎన్నికలను బహిష్కరించారు. దీంతో మండల అధికార యంత్రాంగం అంతా ఆ గ్రామాలకు చేరుకుని ప్రజలను బుజ్జగించే ప్రయత్నం చేసిన వారు ఎన్నికల్లో పాల్గొనేందుకు ససేమీరా అన్నారు జరిగిన విషయాన్ని జిల్లా అధికార యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లడంతో జిల్లా అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ సహా పలువురు అధికారుల బృందం గ్రామానికి చెరుకొని గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సైతం గ్రామస్థులతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

అసెంబ్లీ ఎన్నికల్లోనూ అభ్యర్థుల ముందు అదే సమస్య..

గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తమ గ్రామలకు వచ్చిన ప్రధాన పార్టీల అభ్యర్థుల ముందు గంగాపూర్, రాణిగూడ, కొర్ర తండా, బాబా నాయక్ తండా, అల్లంపెల్లి, ఇస్లాంపూర్ తదితర గ్రామాల ప్రజలు తమకు రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రతిపాదన పెట్టారు. ఎవరు గెలిచిన తమ గ్రామానికి ముందుగా రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇస్తేనే ఎన్నికల్లో పాల్గొంటామని లేకపోతే ఎన్నికలను బహిష్కరిస్తామని ఆనాడే సదరు గ్రామాల ప్రజలు అల్టిమేటం జారీ చేశారు. అభ్యర్థులు సైతం గ్రామస్తుల ప్రతిపాదనకు ఒప్పుకొని తాము గెలవగానే రోడ్డు సమస్యను పరిష్కరిస్తామని బాండ్ పేపర్లు సైతం రాసి ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు.

ఎక్కడి గొంగళి అక్కడే...

అల్లంపెల్లి, గంగాపూర్, రాణిగూడ, కొర్ర తండా, బాబా నాయక్ తండా, తదితర గ్రామాలకు వెళ్లేందుకు రోడ్డు మార్గం సరిగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాల సమయంలో వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తే రోజుల తరబడి ఊర్లు విడిచి బయటకు రాలేని పరిస్థితి ఉంటుందని గ్రామస్థులు చెబుతున్నారు. వీరి సమస్యను పరిష్కరించేందుకు గత ప్రభుత్వ హయాంలో ఖానాపూర్ మండలం ఎర్వచింతల్ సమీపంలో కడెం వాగుపై వంతెన మంజూరు అయ్యింది. వంతెన నిర్మాణ పనులు జరుగుతుండగానే వచ్చిన భారీ వరదలకు వంతెనపై వేసి స్లాబు కొట్టుకుపోయింది. దీంతో వీరి సమస్య మళ్లీ తిరిగి మొదటికి వచ్చింది. వంతెన మంజూరు అవ్వడంతో తమకు ఇక దారి సమస్య తీరినట్లేనని సంబరపడ్డ సదరు గ్రామాల ప్రజలకు వంతెన భారీ వరదలకు కొట్టుకుపోవడం తో మరోసారి నిరాశ తప్పలేదు. ఆ తర్వాత వంతెనను రీ డిజైన్ చేసి ఎత్తు పెంచి నిర్మించాలని సదరు గ్రామాల ప్రజల నుండి పెద్ద ఎత్తున డిమాండ్లు వచ్చాయి. ఆ సమస్యపై సదరు గ్రామాల ప్రజల పోరాటం కొనసాగుతున్న సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడం అభ్యర్థులంతా ఆ సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో వెనక్కి తగ్గి అసెంబ్లీ ఎన్నికల్లో పాల్గొన్నారు. అసెంబ్లీ ఎన్నికలు జరిగి 5 నెలలు కావస్తున్న తమ సమస్య పరిష్కారం కావడం లేదని మరోసారి ఆగ్రహించిన గ్రామస్తులు పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించి తమ నిరసన తెలపాల్సిన పరిస్థితి వచ్చింది. కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సదరు గ్రామాలకు రోడ్డు పనుల కోసం రూ. 20 కోట్ల వరకు నిధులు మంజూరు అయినప్పటికీ ఇప్పటి వరకు మాత్రం ఎటువంటి టెండర్ ప్రక్రియ దాటి పనులు ముందుకు సాగకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది.

అధికారుల హామీతో

రోడ్డు నిర్మాణంపై మరోసారి చిగురించిన ఆశలు

పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించి ఓటు వేయబోమని భీష్మించిన అల్లంపెల్లి, బాబా నాయక్ తండా గ్రామస్తులకు పాలకులు ఇచ్చిన హామీతో రోడ్డు నిర్మాణంపై మరోసారి ఆశలు చిగురిస్తున్నట్లు చెబుతున్నారు. ఒక దశలో అధికారులు మాట్లాడిన ఓటు వేసేందుకు ససేమీరా అన్న సదరు గ్రామాల ప్రజలతో నేరుగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ఫోన్ ద్వారా మాట్లాడినట్లు విశ్వసనీయ సమాచారం. కచ్చితంగా గంగాపూర్, అల్లంపెల్లి, బాబా నాయక్ తండా, రాణిగూడ, కొర్ర తండా, ఇస్లాంపూర్ గ్రామాలకు రోడ్డు మార్గాన్ని నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు కచ్చితంగా చేపడుతుందని హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఇన్నాళ్లు కేవలం అధికారులు, ఎమ్మెల్యేల వరకు పరిమితమైన తమ సమస్య ఇప్పుడు ఏకంగా ప్రభుత్వం దృష్టికి వెళ్లిందని ఎట్టి పరిస్థితిలో ఈసారి రోడ్డు నిర్మాణం జరిగి తీరుతుందని సదరు గ్రామాల ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారు. రోడ్డు నిర్మాణం కోసం వైల్డ్ లైఫ్ అనుమతులు సైతం వచ్చినట్లు చెబుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణ మార్గంలో వన్యప్రాణులు దాటేందుకు అండ ర్‌పాస్ వంతెనను నిర్మాణం చేయాలని సదరు అనుమతుల్లో నిబంధన ఉన్నట్లుగా చెబుతున్నారు. అందుకోసం ప్రభుత్వం నుండి 80 లక్షలు చెల్లించి అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉన్నందున ఇక మంత్రి సీతక్క నుండే రోడ్డు నిర్మాణ సమస్య పరిష్కారం కోసం హామీ దక్కిన నేపథ్యంలో ఈ నిధుల చెల్లింపు ఇక ఆలస్యం కాదని తమ సమస్యకు పరిష్కారం దొరికినట్లేనని అడవి బిడ్డలు భావిస్తున్నారు.

గిరిజన గ్రామాల్లో తాగునీటి కటకట

● పలు ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మంచినీటి పథకాలు ఉన్నా.. ప్రయోజనం శూన్యం ● అలంకారప్రాయంగా మారిన నీటి ట్యాంకులు ● స్థానిక గిరిజనులకు తప్పని నీటికష్టాలు



కుమ్మరికుంటలో బోరువద్ద నీళ్ల కోసం పెట్టిన బిందెలు

ఉట్నూర్, మే 15: మండలంలోని గిరిజన గ్రామాల్లో కోట్లాది రూపాయాలతో నిర్మించిన మంచినీటి పథకాలు ఉన్న ప్రయోజనం శూన్యంగా కనిపిస్తుంది. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మంచినీటికి కటకట ఏర్పడుతుంది. ఉట్నూర్ మండలంలోని కుమ్మరికుంట గిరిజన గ్రామాల్లో అనాధిగా కోలాం గిరిజనులు జీవిస్తున్నారు. 60 గిరిజన కుటుంబాలు ఉన్న కుమ్మరికుంట గ్రామంలో కేవలం మూడు బోర్లే ఉండడంతో మంచినీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని గిరిజనులు వాపోతున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా గిరిజన గ్రామాలకు మంచినీరు అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న ఉన్నతాధికారులు గ్రామీణ ప్రాంతాలలో ఎంత మేరకు నల్లాలు పని చేస్తున్నాయో పరిశీలించడం లేదు. కేవలం జిల్లా కేంద్రాలకు పరిమితమై అధికారులు ఇచ్చే తప్పుడు నివేదికలతో మంచినీరు అందిస్తున్నామని ప్రకటించుకుంటున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి నల్లానీరు అందిస్తామని ఏర్పాటు చేసిన నల్లాలు గిరిజనుల ఇండ్ల ముందు దిష్టిబొమ్మలుగా కనిపిస్తున్నాయి.కుమ్మరికుంట గిరిజనులు మంచినీటి కోసం బోరు బావుల వద్ద బారులు తీరాల్సి వస్తుందని పేర్కొంటున్నారు.ఇది ఇలా ఉండగా కోలాం గిరిజనులు జీవిస్తున్న మరో గ్రామమైన మొర్రిపేటలో సైతం గిరిజనులు తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులు యుద్ధ ప్రాతిపదికన సింథటిక్ ట్యాంకులు ఏర్పాటు చేసిన బావుల నుంచి నీరు అందిస్తున్నామని చెబుతునప్పటికి గ్రామాలలో ఏర్పాటు చేసిన సింథటిక్ ట్యాంకులు సైతం అలంకార ప్రాయంగా మారాయి. బోరుబావులు పని చేయక పోవడంతో బావినీరు తాగుతున్నామని గిరిజనులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికా రులు జోక్యం చేసుకుని గిరిజనులకు మంచినీరు అందేలా చర్యలు తీసుకోవాలని పరిశీలకులు అంటున్నారు.



మారుమూల ప్రాంతంలోని కుమ్మరికుంటర గిరిజన గ్రామం



ఉపయోగంలో లేని నల్లాలు



అలంకారప్రాయంగా సింథటిక్ ట్యాంకు



మొర్రిపేటలో అలంకారప్రాయంగా ఉన్న మంచినీటి పథకాలు

మంచినీటి కోసం ఇబ్బందిగా ఉంది



: టేకం సంగీత, కుమ్మరి కుంట

మా గ్రామంలో ఉన్న బోరుబావుల్లో మాకు సరిపడా తాగునీరు రావడం లేదు. దీంతో తీవ్ర నీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. గ్రామంలోని మొత్తం 60 ఇళ్ల కోసం కేవలం మూడు బోరుబావులే ఉన్నాయి. దీని వల్ల నీటి కోసం బోరుబావుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తుంది.

మరమ్మతులు చేయిస్తాం

: సురేందర్, ఏఈఈ

ఉట్నూర్ మండలంలోని కుమ్మరికుంట, మొర్రిపేట గ్రామాలలో మంచినీటి ఇబ్బందులు ఉన్నాయి. అయితే ఈ విషయం మా దృష్టికి వచ్చింది. పంచాయతీ సెక్రటరీకి చెప్పాము. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం. స్థానిక ఆదివాసీ గిరిజనులకు తాగునీటి కష్టాల సమస్యను పరిష్కరిస్తాం.



వన్ టౌన్‌లో ఫిర్యాదు చేస్తున్న మున్నూరుకాపు కులస్థులు

'కంది వెంటనే క్షమాపణలు చెప్పాలి'

ఆదిలాబాద్ అర్బన్, మే 15: కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజక వర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి మున్నూరుకాపు కులస్థుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని తాలుకా మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కాళ్ల విఠల్ అన్నారు. కంది శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తూ బుధవారం ఆదిలాబాద్ పట్టణంలో సంఘ భవనం నుంచి ర్యాలీగా బయలుదేరి వన్‌టౌన్ సీఐ సత్యనారయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పత్రిక సమావేశంలో కంది శ్రీనివాస్‌రెడ్డి మున్నూరు కాపు కులస్థులైన గండ్రత్ సుజాతపై చేసిన వ్యాఖ్యలపై క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందులో మున్నూరుకాపులు, తదితరులున్నారు.

కొనసాగుతున్న ఉష్ణోగ్రతల తీవ్రత

● భీంపూర్‌లో 42.4 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో గరిష్ట స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. బుధవారం జిల్లా సగటు గరిష్ట ఉష్ణోగ్రత 40.3 డిగ్రీలుగా నమోదు కాగా కనిష్టంగా 24.7 డిగ్రీలు నమోదయ్యాయి. అత్యధికంగా భీంపూర్ మండలంలో 42.4, ఆదిలాబాద్ అర్బన్‌లో 41.9, బేలలో 41.5, నేరడిగొండలో 40.4, జైనత్‌లో 40.2 గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మిగితా చోట్ల 40 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గత వారం రోజులుగా అడపదడపగా కురుస్తున్న అకాల వర్షాలతో వాతావరణం కొంత చల్లబడింది. పగలంతా ఎండల తీవ్రత కనిపిస్తున్న సాయంత్రం వేళల్లో వాతావరణం ఒక్కసారి చల్లబడి కనిపిస్తుంది. నిత్యం ఎక్కడో ఓ చోట చిరుజల్లులు కురుస్తున్నాయి. మరో పక్షం రోజుల్లో వానకాల సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉండడంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిశీలన

బోథ్, మే 15 : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని బుధవారం జిల్లా రిజిస్ట్రార్ ఫణీంధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా నూతన భవనంలో వసతులను పరిశీలించడంతో పాటు రిజిస్ట్రేషన్‌కు కావాల్సిన పరికరాలను ఏ మేరకు అవసరమవుతాయి అనే విషయాన్ని పరిశీలించారు. కాగా త్వరలోనే పాత కార్యాలయం నుంచి నూతన కార్యాలయంలోకి మార్చుతామన్నారు. జిల్లా అధికారులతో మాట్లాడి తగు ఏర్పాట్లు చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట సబ్ రిజిస్ట్రార్ సాయినాథ్ ఉన్నారు.

'తడిసిన ధాన్యం పట్ల ఆందోళన వద్దు'

బోథ్, మే 15: భారీ వర్షంతో జొన్న పంట తడిసిపోవడం జరిగిందని ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని సహకార సంఘం డైరెక్టర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గొర్ల రాజు యాదవ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అకాల వర్షాల వల్ల మార్కెట్ యార్డులో జొన్న పంట నానిపోవడం జరిగిందని అంతేగాక పూతకు వచ్చిన పంట సైతం నానిందని అన్నారు. ఈ విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దని రైతు సమస్యను గమనించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గత మూడు రోజుల క్రితమే తడిసిన ధాన్యాన్ని సైతం కొంటామని వివరించారన్నారు. బోథ్ ప్రాంత రైతుల సమస్యను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా విన్నవించడం జరుగుతుందన్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసకువెళ్లి జొన్న పంట కొనుగోలు చేసే విధంగా చూడాలని కోరుతామన్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఇచ్చోడ, మే 15: మండలంలోని గేర్జం గ్రామ శివారులో గత మూడు రోజుల కిత్రం కురిసిన వర్షాలకు విద్యుత్తు తీగలు తెగి కిందపడడంతో అటువైపు వెళ్లిన ఎద్దు విద్యుత్తు తీగలకు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల వివరాల ప్రకారం.. విద్యుత్తు తీగలు చెట్లకు అనుకోని ఉండడంతో ఈదురుగాలులతో వీచిన గాలివానకు తీగలు నెలకొరిగాయి. దీంతో ఎద్దు అటుగా వెళ్లి విద్యుదాఘాతానికి గురై మృతిచెందింది. గేర్జం గ్రామానికి చెందిన పడిగెల గంగయ్య అనే రైతు ఎద్దు విలువ రూ. 50వేల వరకు ఉంటుందని విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు, రైతులు కోరతున్నారు.



మృత్యువాత పడ్డ ఎద్దు వద్ద రైతు గంగయ్య

రిమ్స్‌లో పేషెంట్‌కేర్ ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్ అర్బన్, మే 15: జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో పేషెంట్‌కేర్‌గా పని చేస్తున్న లక్ష్మి అనే మహిళ ఆత్మహత్యయత్నం చేసుకుంది. బుధవారం రిమ్స్‌లోనే ఫినాయిల్ తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. గమనించిన సిబ్బంది స్పందించి ఎంఐసీయూ వార్డుకు తరలించి చికిత్స అందిస్తున్నారు. సూపర్‌వైజర్ బెదిరింపులు తట్టుకోలేక ఆత్మహత్యయత్నం చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

● త్రిసభ్య కమిటీతో విచారణ జరిపిస్తాం : డైరెక్టర్

ఆదిలాబాద్ పట్టణంలోని రిమ్స్ ఆసుపత్రిలో పేషేంట్ కేర్‌గా పని చేస్తున్న లక్ష్మి ఆత్మహత్యయత్నం ఘటన పై త్రిసభ్య కమిటీ వేసి విచారణ జరిపిస్తామని రిమ్స్ డైరెక్టర్ రాథోడ్‌జైసింగ్ అన్నారు. ఈ మేరకు బాధితురాలిని రిమ్స్ ఏంఐసీయూ వార్డులో పరామర్శించి ఘటన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రిమ్స్ డైరెక్టర్ మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. త్రిసభ్య కమిటీతో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

● సూపర్‌వైజర్‌ను తొలగించాలని నిరసన

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రిలో పని చేస్తున్న కార్మికులపై బెదిరింపులకు పాల్పడుతున్న సూపర్‌వైజర్‌ను తొలగించాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ వార్డు ఎదుట కార్మికులతో కలిసి నిరసన తెలిపారు.పేషేంట్‌కేర్ లక్ష్మి ఆత్మహత్యయత్నంకు బాధ్యులైన సూపర్‌వైజర్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ విషయమై రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

● బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని వినతి

ఆదిలాబాద్ అర్బన్: రిమ్స్ ఆసుపత్రిలో ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస్ విభాగంలో పేషేంట్ కేర్‌గా పని చేస్తున్న గణపతిలక్ష్మి ఆత్మహత్యాయత్నం చేసుకున్న ఘటనలో బాధితురాలికి న్యాయం చేసి, బాధ్యుల్ని కఠినంగా శిక్షించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మికులందరు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.అనంతరం రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్‌కు వినతి పత్రం అందించారు. హెడ్ సూపర్‌వైజర్ అకారణంగా పనిలో నుంచి వెళ్లిపొమ్మనడంతో మనస్థాపానికి గురై ఈ చర్యకు పాల్పడినట్లు బాధితురాలు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యులైన సూపర్‌వైజర్‌ను విధుల నుంచి తొలగించాలని బాధితురాలికి రూ.5లక్షల నష్ట పరిహారం అందించి ఉత్తమ చికిత్స అందించాలన్నారు. ఆమె కోలుకుని విధుల్లో చేరేంత వరకు వేతనంతో కూడిన సెలవులు అందించాలని డిమాండ్ చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోలేని పక్షంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఇందులో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.నవీన్ కుమార్, అగ్గిమల్ల స్వామి, రిమ్స్ నాయకులు పెర్క.దేవిదాస్, అక్రమ్ ఖాన్, సుభాష్, దశాంత్, రమేష్, శేఖర్, ఖలీల్, సుమన్‌తాయి, రాణి, అనసూయ, రిమ్స్ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మి



రిమ్స్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

బీజేపీతో లోపాయికారి ఒప్పందం

● కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సంతోష్‌రావు ● పాయల శంకర్, గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డిల దిష్టిబొమ్మ దహనం

ఆదిలాబాద్ అర్బన్, మే 15: బీజేపీ ఎమ్మెల్యే పాయల శంకర్‌తో కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు గండ్రత్‌సుజాత, అల్లూరి సంజీవ్ రెడ్డిలు కుమ్మకై లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిమ్మా సంతోష్‌రావు ఆరోపించారు. వారి వైఖరిని ఖండిస్తూ పట్టణంలోని కైలాస్‌నగర్‌లో ఆందోళనకు దిగి పాయల శంకర్, గండ్రత్ సుజాత, అల్లూరి సంజీవ్‌రెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌రావు మాట్లాడుతూ గండ్రత్ సుజాత, సంజీవ్‌రెడ్డిలు అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ నుంచి బయటకు వెళ్లి రెబల్‌గా బరిలోకి దిగారని గుర్తు చేశారు. మళ్లీ లోక్‌సభ ఎన్నికల్లోను బీజేపీ నాయకులతో ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. ఇదే విషయాన్ని ప్రస్థావిస్తూ కంది శ్రీనివాస్‌రెడ్డి గండ్రత్ సుజాత తప్పిదాన్ని ఎత్తిచూపారే తప్ప మున్నూరు కాపులను ఎక్కడ కూడా దూషించ లేదన్నారు. ఈ విషయాన్ని సంఘం సభ్యులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. పాయల శంకర్ కుమలతాల మధ్య చిచ్చు పెట్టే యత్నం చేస్తున్నారని దీనిని తామంతా ఖండిస్తున్నామన్నారు. ఇందులో మున్సిపల్ వైస్ చైర్మన్ జహీర్‌రంజాని, జైనథ్ జడ్పీటీసీ తుమ్మల అరుంధతి, వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు సాయిప్రణయ్, జాఫర్‌అహ్మద్, ఆవుల వెంకన్న, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్,పట్టణ అధ్యక్షుడు గుడిపెల్లినగేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీలేఖ, అన్నపూర్ణ, నలగంటి నవీన్, చందు, ఖయ్యుం, తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



మృతి చెందిన మేకలు

విద్యుత్ షాక్‌తో 9 మేకల మృతి

నేరడిగొండ, మే 15: మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆడేంఅర్జున్‌కి చెందిన 9 మేకలు విద్యుత్ షాక్‌కి గురై మృతి చెందాయి. 80 మేకలను మేత కోసం అడవికి తీసుకెళ్లే క్రమంలో గ్రామ సమీపంలో విద్యుత్ వైర్లు తెగిపడి ఉండడంతో మేకలను మేతకు వైర్ పై నుంచి వెళ్లే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాయి.విద్యుత్ అధికారుల నిర్లక్ష్యంతో మేకలు మృతి చెందాయని రైతు వాపోయారు.



రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ అధికారులు

మార్కెట్ కమిటీలో రికార్డులను పరిశీలించిన ఆడిట్ బృందం

బోథ్, మే 15: మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం ఆడిట్ అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ యార్డులో పలు రికార్డులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా ఆడిట్ అధికారులు సలావుద్దీన్, ఖలీద్‌లు ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న క్రాంతికుమార్

ఘటిక క్రాంతిపై హత్యాయత్నం!!

ఆదిలాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): బీజేపీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఘటిక క్రాంతిపై బుధవారం కొందరు హత్యాయత్నానికి ప్రయత్నించినట్లు తెలుస్తుంది. ఈ మేరకు ఘటిక క్రాంతి టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొందరు అనుచరులు కంది శ్రీనివాస్‌రెడ్డి మద్దతుతో హత్య చేసేందుకు ప్రయత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. నలుగురు దుండగులు హత్య చేసేందుకు ప్రయత్నించగా ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తుంది. ఒకరు పరారీలో ఉన్నట్లు సమాచారం. అయితే గత రెండు రోజులుగా బీజేపీ వర్సెస్ కాంగ్రెస్ అన్నట్లుగా రాజకీయాలు సాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే హత్యాయత్నం ఘటన మళ్లీ తెరపైకి రావడంతో జిల్లా రాజకీయాలు హీటెక్కుతున్నాయి. ఈ మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.2 కనిష్ఠం 27.9
నిర్మల్
జిల్లా వార్తలు
8
గురువారం 16 మే 2024



ఊపిరి పీల్చుకున్న యంత్రాంగం



- లోక్‌సభ ఎన్నికల నిర్వహణ విజయవంతం
- ఇక సాధారణ పరిపాలన వైపు కలెక్టర్ నజర్
- ధాన్యం, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై ఫోకస్
- అన్ని శాఖల్లో మొదలైన కార్యకలాపాలు


నిర్మల్, మే 15 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ పూర్తవ్వడం, ఆశించిన దాని కన్నా ఎక్కువగానే పోలింగ్‌శాతం నమోదు కావడం ఎక్కడ కూడా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోలేకపోవడంతో జిల్లా యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. ముఖ్యంగా జిల్లా కలెక్టర్ ఆశిష్‌సంగ్వాన్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారులంతా గత రెండు నెలల నుంచి లోక్‌సభ ఎన్నికల విజయవంతానికి పెద్దఎత్తున కృషి చేశారు. కలెక్టర్ దిశానిర్దేశంలో అధికారులంతా రాత్రింబవళ్లు ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించాయి. ముఖ్యంగా జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ 70 శాతం దాటడంతో అధికారులు రెండు నెలలుగా పడిన కష్టానికి ఫలితం దక్కినట్లయ్యిందంటున్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రతీరోజూ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్షలు జరుపుతూ అధికారులందరిని క్రియాశీలకం చేశారు. కలెక్టర్ మార్గదర్శకత్వంలో అధికారులు తమకు కేటాయించిన విధులపై ప్రత్యేకదృష్టి సారించారు. అత్యవసరమైతే తప్ప ఇతర కార్యకలాపాలను తాత్కాలికంగా పక్కన పెట్టి కేవలం ఎన్నికలపైనే అధికారులంతా ఫోకస్ పెట్టారు. ముఖ్యంగా ఎన్నికల విధులను నిర్వహించే సిబ్బందికి రెండు విడతలుగా శిక్షణలు పూర్తి చేసిన అధికారులు ఆ తరువాత పోలింగ్ నిర్వహణను పకడ్బందీగా పూర్తి చేశారు. దీంతో పాటు పోలీసు శాఖ సైతం పోలింగ్ నిర్వహణలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టారు. ముందుగానే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి ఆ పోలింగ్‌కేంద్రాలపై ప్రత్యేకదృష్టి పెట్టారు. సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల్లో ఎన్నికలు సజావుగా జరిపించేందుకు సంబంధిత అధికారులను ప్రత్యేకంగా నియమించారు. అలాగే జిల్లా సరిహద్దుల్లో చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నగదు, మద్యం తరలిరాకుండా గట్టిచర్యలు తీసుకున్నారు. పోలీసుల తనిఖీల్లో అక్రమంగా తరలిస్తున్న దాదాపు రూ. 3 కోట్లకు పైగా డబ్బులు పట్టుబడ్డాయి. జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో అధికారుల కృషి మేరకు 70శాతానికి పైగా పోలింగ్ దాటిపోవడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. ప్రతీఒక్కరు తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ప్రచారం చేపట్టారు. 2కే రన్, అవగాహన కార్యక్రమాలతో పాటు సోషల్‌మీడియా ద్వారా కూడా ఓటు విలువను తెలుపుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ముఖ్యంగా ఈ సారి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా పోలింగ్ నమోదు కావడానికి అధికారుల కృషియే కారణమంటున్నారు. కాగా ఎన్నికలను ఎట్టకేలకు విజయవంతం చేసిన జిల్లా కలెక్టర్ ఇక పాలనపై దృష్టి సారించారు. ధాన్యం కొనుగోళ్లు, తరలింపు, సీఎంఆర్ లాంటి వాటిపైనే కాకుండా అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై కూడా కలెక్టర్ దృష్టి సారిస్తున్నారు. దీంతో పాటు అన్ని శాఖల అధికారులను తమ తమ శాఖ పరిధిలో చేపట్టాల్సిన పనుల్లో నిమగ్నం కావాలంటూ ఆదేశిస్తున్నారు. దీనికి సంబంధించి కలెక్టర్ అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఎట్టకేలకు తిరిగి సాధారణ పరిపాలన జిల్లాలో మళ్లీ మొదలైందని అంటున్నారు.

70 శాతం దాటిన పోలింగ్

జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో ఈ సారి పోలింగ్ 70 శాతానికి పైగా దాటడం పట్ల అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిర్మల్ నియోజకవర్గంలో 2,58,314 లక్షల మంది ఓటర్లకు గానూ 1,85,168 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ లెక్క ప్రకారం నిర్మల్ నియోజకవర్గంలో 71.68శాతం ఓటింగ్ నమోదైంది. అలాగే ముథోల్ నియోజకవర్గంలో మొత్తం 2,54,579 మంది ఓటర్లకు గానూ 1,92,546 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ అత్యధికంగా 75.63 శాతం ఓట్లు పోలయ్యాయి. అలాగే ఖానాపూర్ నియోజకవర్గంలో మొత్తం 2,24,523 లక్షల మంది ఓటర్లకు గానూ 1,62,101 లక్షల మంది ఓటర్లు ఓటు వేశారు. ఇక్కడ 72.20శాతం పోలింగ్ నమోదైంది. ఈ సారి పట్టణ ప్రాంతాల కన్నా గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదు కావడం పట్ల అధికార యంత్రాంగం సంతృప్తి వ్యక్తం చేస్తోంది. గ్రామస్థాయిలో ఓటింగ్ ప్రాధాన్యతను వివరిస్తూ అధికారులు చేసిన ప్రయత్నాలు ఫలించాయంటున్నారు. విస్తృత ప్రచారంతో పాటు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోనే పోలింగ్‌శాతం ఎక్కువగా నమోదైందని అధికారులు పేర్కొంటున్నారు.

ఫలించిన పోలీసుశాఖ ప్రయత్నాలు

జిల్లాలో జరిగిన ఎన్నికల సందర్భంగా ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీసులు చేపట్టిన యాక్షన్‌ప్లాన్ ఫలించింది. జిల్లా ఎస్పీ జానకీ షర్మిల ఆధ్వర్యంలో భైంసా ఏఎస్పీ, నిర్మల్ డీఎస్పీ, సీఐలు, ఎస్‌ఐలు సమిష్టిగా ఎన్నికలపై దృష్టి కేంద్రీకరించారు. సరిహద్దు చెక్‌పోస్టులను ఎస్పీ నిరంతరం తనిఖీలు చేస్తూ నగదు. మద్యం జిల్లాలోని రాకుండా అడ్డుకోగలిగారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాలు, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గ్రామాలస్థాయిలో గుర్తించి అక్కడ ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. దీంతో మొత్తం 2వేల మందికి పైగా ప్రత్యేకబలగాలను ఇక్కడికి రప్పించి భద్రతచర్యల్లో వారిని నిమగ్నం చేశారు. దీని కారణంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు. అన్ని పోలింగ్‌కేంద్రాల వద్ద పకడ్బందీగా బందోబస్తు చర్యలు చేపట్టడంతో ఈసారి ప్రధాన రాజకీయ పార్టీల కార్యకర్తల హడావిడి పోలింగ్ కేంద్రాల దూరానికే పరిమితమైంది. పోలీసులు ముందస్తుగానే రౌడీ షీటర్‌లను, పాతకేసుల్లో ఉన్న నేరస్థులను పిలిపించి వారందరిని బైండోవర్ చేశారు. ప్రతీరోజూ జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఎన్నికలకు సంబంధించిన నిఘా, విధుల నిర్వహణపైనా సమీక్షలు జరుపుతూ దానికి అనుగుణంగా చర్యలు చేపట్టారు. జిల్లాకేంద్రంలో కాంగ్రెస్ తరపున రాహుల్‌గాంధీ, బీఆర్‌ఎస్ పార్టీ తరపున కేటీఆర్‌లు పర్యటించారు. ఈ పర్యటనలకు పోలీసులు పెద్దఎత్తున భద్రత చర్యలు చేపట్టారు. ఇలా ఎన్నికల నిబంధనల పాటింపుపై దృష్టి సారిస్తూనే ఎక్కడ కూడా ఆవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు చేపట్టడంలో పోలీసు యంత్రాంగం విజయవంతమైందంటున్నారు.



ఆర్టీసీ సిబ్బందికి మెగా వైద్య శిబిరం

72 మందికి ఆరోగ్య పరీక్షలు



ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిర్మల్ కల్చరల్, మే 15 : నిర్మల్ ఆర్టీసీ ఉద్యోగులకు బుధవారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. డిపో ఆవరణలో ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రాండ్‌హెల్త్ ఛాలెంజ్‌లో భాగంగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి తెలిపారు. ఈ శిబిరం దేవిబాయి క్రిటికల్ కేర్ మల్టీ హాస్పిటల్ వైద్యురాలు డాక్టర్ చంద్రిక, విద్యాసాగర్‌రావు ప్రారంభించారు. 72 మందికి ఈసీజీ, మధుమేహం, కొలెస్ట్రాల్ తదితర వైద్యపరీక్షలు నిర్వహించారు. పలు వైద్యసూచనలు చేశారు. అసిస్టెంట్ మేనేజర్లు రాజశేఖర్, నవీన్‌కుమార్, ఉద్యోగులు పాల్గొన్నారు.

కుస్లిలో నకిలీ విత్తనాలపై అవగాహన



కుస్లి గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు దృశ్యం

నర్సాపూర్(జి), మే 15 : మండలంలోని కుస్లి గ్రామంలో బుధవారం రైతులకు గ్రామ పంచాయతీ ఆవరణలో వ్యవసాయ విస్తరణ అధికారి భాగ్యలక్ష్మి విత్తనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వానాకాలం సీజన్ ప్రారంభం అవుతున్న సమయంలో విత్తనాలు ఆధీకృత డీలర్ వద్దనే రసీదు తీసుకొని మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. లూజు సంచులలో అమ్మేవారి వివరాలను స్థానిక సబ్ ఇన్స్‌పెక్టర్‌కు ఫోన్ 8712659518 ద్వారా సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు భూమేశ్, గంగారాం, గణేష్ పటేల్, రామకృష్ణ, పంచాయతీ సెక్రెటరీ కిరణ్ కుమార్‌లు పాల్గొన్నారు.

బాసరలో మున్నూర్‌కాపు సంఘ భవన నిర్మాణానికి విరాళం



కుభీర్, మే 15 : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం బాసరలో మున్నూర్‌కాపు సంఘ భవన నిర్మాణానికి పల్సి గ్రామ మున్నూర్‌కాపు సంఘం ఆధ్వర్యంలో బుధవారం రూ. 1,01,111లు విరాళంగా అందజేశారు. బాసరలో మున్నూర్‌కాపు సంఘ భవన నిర్మాణానికి ఇప్పటికే భూమిని కొనుగోలు చేయడం జరిగిందని భవన నిర్మాణానికి విరాళలను సేకరించడం జరుగుతుందని ముథోల్ నియోజక వర్గ మున్నూర్‌కాపు సంఘం అధ్యక్షులు రోళ్లరమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కుభీర్ మండల మున్నూర్‌కాపు సంఘం అధ్యక్షులు సిద్ధంవార్ వివేకానంద, పల్సి మున్నూర్‌కాపు సంఘ ప్రతినిధులు కొట్టే సత్యనారాయణ, సాయినాథ్, రాందాస్, హన్మండ్లు, అబ్బయ్య, లింగన్న, రాజన్న, రాములు, లస్మన్న, భూమన్న, తదితరులున్నారు.

కొండెక్కిన కోడిమాంసం

● రూ.260కు చేరిన ధర



భైంసా, మే 15: కోడికూర కొండెక్కింది. మండే ఎండల వలే భగ్గుమంటోంది. కిలో ధర రూ. 260కి చేరి మాసం ప్రియులకు చుక్కలు చూపెడుతోంది. సాధారణంగా వేసవిలో చికెన్ ధరలు తగ్గుతాయి. కానీ ఈ సారి అందుకు భిన్నంగా రికార్డు స్థాయికి చేరుకున్నాయి. పెరిగిన ఎండలే అందుకు కారణమవుతున్నాయి. అధిక ఉష్ణోగ్రతల వల్ల కోళ్లు చనిపోతాయని, ఎదగవని భావించిన చాలా మంది రైతులు క్రాప్ హాలీడేను ప్రకటించుకుని పెంపకాన్ని చేపట్టలేదు. పెద్ద కంపెనీలు, బడా రైతులు మాత్రమే ఎండలకు తగ్గ ఏర్పాట్లు చేసుకొని పెంచుతున్నారు. డిమాండ్‌కు తగ్గ ఉత్పత్తి లేకపోవడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

చికెన్ ధర భారీగా పెరిగింది. కిలో ధర ర. 260 పలుకుతోంది. జిల్లాలోని చికెన్ మార్కెట్లలో గత నెల రోజులుగా ధరలు పెరుగుదల బాటలో కొనసాగుతున్నాయి. గత నెల అరంభంలో రూ.160లతో లభ్యమైన చికెన్ ధరలు క్రమక్రమంగా పెరుగుతూ పోయాయి. ఈ నెల అరంభంలో కిలో చికెన్ ధర రూ.200 ఉండగా రెండవవారం నాటికి ధర రూ.40 పెరిగి రూ.240కు చేరుకుంది. ప్రస్తుత ధర మరో రూ.20 మే పెరిగి కిలో చికెన్ ధర రూ.260లకు చేరుకుంది. 42 నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతకు చేరుకున్న వేసవి తీవ్రతకు బ్రాయిలర్ కోళ్లు చనిపోతాయని, సైజ్ పెరగవని భావించిన చాలా మంది రైతులు క్రాప్ హాలీడే ప్రకటించుకున్నారు. కోళ్లను పెంచలేదు. ఆర్థికంగా ఎదిగిన రైతులు, బ్రాయిలర్ మార్కెట్‌ను శాసిస్తున్న పెద్ద కంపెనీలు మాత్రమే అధిక ఉష్ణోగ్రతలకు తగిన ఏర్పాట్లు చేసుకొని కోళ్లను పెంచారు. డిమాండ్ మేరకు మార్కెట్లో కోళ్లు లేకపోవడంతో ధర పెరిగినట్లుగా తెలుస్తోంది.

● తప్పదన్నట్లు కొంటున్నాం

(అజయ్ కుమార్ , రాజీవ్ నగర్, భైంసా)

చికెన్ ధరను చూస్తే భయమేస్తుంది. తప్పదుకాబట్టి కొంటున్నాం. మొదటి సారి కిలో రూ. 260ల చొప్పున కొనాల్సివస్తుంది. ధర ఇలాగే ఉంటే కొనడం కష్టమే. వేసవిలో చికెన్ దర తగ్గుతుందని భావిస్తే కొండెక్కి కూర్చున్నది.

● ఉత్పత్తి తగ్గడం మూలంగానే

(హైమద్, చికెన్‌షాప్ నిర్వాహకుడు, భైంసా)

చికెన్ ధర వేసవి కాలంలో ఎప్పుడూ ఇంతగా పెరగలేదు. ఎండ వేడిమికి చాలా వరకు కోళ్లు చనిపోతున్నాయి. నీళ్లలేక కొందరు రైతులు కోళ్లను పెంచలేదు. ఎండ వేడిమికి చనిపోతాయని చిన్న రైతులేవరు కోళ్లను పెంచలేదు. ఉత్పత్తి ఖర్చు పెరుగుతుందని కంపెనీలు ధరను పెంచాయి.



అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత పాటించాలి : కలెక్టర్

నిర్మల్ కల్చరల్, మే 15 : అమ్మ ఆదర్శ పాఠశాల పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలల్లో త్రాగునీరు, మరుగుదొడ్లు, స్లాబ్ మరమ్మతు, తదితర పనులు చేపట్టాలని ఆదేశించారు. పనుల ప్రారంభం ముందు తరువాత ఫోటోలతో నివేదికలు పంపాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్ రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీవో శ్రీనివాస్, తదితర అధికారులు పాల్గొన్నారు.

వర్షాల వల్ల రైతులు నష్టపోకుండా చూడాలి

ధాన్యం కొనుగోళ్లు, వర్షాలతో రైతులు నష్టపోకుండా చూడాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. బుధవారం సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించి తీసుకోవలసిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. ధాన్యం కొనుగోళ్లు నిరంతరం పర్యవేక్షించాల న్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని, క్లీనింగ్ మిషన్, గన్ని బ్యాగులు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలన్నారు. క్షేత్ర స్థాయిలో కేంద్రాలను రోజు పర్యవేక్షించాలని, రిపోర్టులు సమర్పించాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎస్‌వో నందిత, డీఎం శ్రీకళ, డీఆర్డీవో విజయలక్ష్మి, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, మార్కెటింగ్ ఏడీఅశ్వక్ పాల్గొన్నారు.

చినుకు కురిసినా.. గాలి వీచినా.. నిలిచిపోతున్న విద్యుత్ సరఫరా



భైంసా విద్యుత్ సబ్‌స్టేషన్

భైంసా, మే 15 : మున్సిపల్ కేంద్రమైన భైంసాలో విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతోంది. చిన్నపాటి చినుకు కురిసిన, గాలివీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. గత పక్షం రోజులకు పైగా కాలం నుంచి ఇక్కడి ప్రాంతంలో ఈదురు గాలులతో కూడిన వర్షాలు అధికంగా కురుస్తున్నాయి. రోజు సాయంత్రం, రాత్రి వేళలో గాలి, వర్షం బెడద నెలకొంటోంది. గాలి తాకిడి,వర్షం కురియడం మొదలయ్యిందంటే చాలు విద్యుత్ సరఫరా నిలిచిపోవడం పరిపాటిగా మారిపోయింది. ఇలాంటి సమయాల్లో నిలిచిపోతున్న విద్యుత్ సరఫరా వ్యవస్థ గంటల కొద్ది పునరుద్ధరణకు నోచుకోవడం లేదు. దీంతో విద్యుత్ వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా రాత్రివేళలో విద్యుత్ సరఫరా నిలిచిపోయిన సమయాల్లో వినియోగదారులు పడుతున్న పాట్లు వర్ణణాతీతంగా ఉంటున్నాయి. ఫ్యాన్లు తిరుగక, ఉక్కపోత బాధ భరించలేక నరకయాతన పడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. నిర్వాహణ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం మూలంగానే విద్యుత్ సరఫరాలో సమస్యలు ఏర్పడుతున్నాయనే విమర్శలున్నాయి. ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు నిర్వహణ వ్యవస్థను మెరుగుపరచి విద్యుత్ సరఫరా వ్యవస్థను పూర్తిస్థాయిలో మెరుగుపరచి తమ సమస్యలను తీర్చాలని వినియోగదారులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల్లో బిజీబిజీగా అధికార యంత్రాంగం

● ముగిసిన ఎన్నికల విధులు ● సమీక్షలు,సమావేశాల్లో తలమునకలు

భైంసా,మే 15 : పార్లమెంట్ ఎన్నికల విధులు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వ అధికారులు తమ శాఖలకు సంబంధించిన పనుల్లో బిజీబిజీ అయిపోయారు. గత నెల రోజులుగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పార్లమెంట్ ఎన్నికల బాధ్యతలు,విధుల నిర్వాహణ వ్యవస్థలో సమయం గడిపారు. రెవెన్యూ అధికారులు ఎన్నికల పూర్తి స్థాయి బాధ్యతలు నిర్వర్తించగా ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు తమ తమ స్థాయిలకు అనుగుణంగా కేటాయించిన విధులను చేపట్టారు. ప్రధానంగా తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయాధికారులు, విద్యాశాఖాధికారులు, పంచాయతీరాజ్,ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు ఎన్నికల నిర్వాహణ వ్యవస్థకు సంబంధించిన కీలక విధులను చేపట్టారు. సోమవారం పోలింగ్ ప్రక్రియ పూర్తవ్వడం, మంగళవారం ఈవీఎం యంత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకోవడంతో వివిధ ప్రభుత్వ శాఖాధికారుల ఎన్నికల విధులు పూర్తయ్యాయి. దీంతో నెల రోజులుగా ఎన్నికల విధులతో తమ తమ ప్రభుత్వ శాఖల బాధ్యతలను అంతంత మాత్రంగానే చేపట్టిన ఆయా శాఖల అధికారులు బుధవారం నుంచి తమ శాఖల పనుల్లో తలమునకలయ్యారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయాధికారులు, విద్యాధికారులు తమ తమ శాఖలకు చెందిన సమీక్షలు, సమావేశాలను నిర్వహించారు.నెల రోజులుగా వివిధ కారణాలతో పెండింగ్‌లోనున్న వివిధ ఫైళ్ల క్లియరెన్స్‌లను చేపట్టారు. బుధవారం అన్ని శాఖల అధికారులు విధులకు హాజరు కావడంతో ప్రభుత్వ కార్యాలయాలన్నీ సందడిగా కనిపించాయి.



సంక్షిప్త సమాచారం

జిల్లాలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

నిర్మల్ కల్చరల్, మే 15 : నిర్మల్ జిల్లాలో బుధవారం 39.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైనట్టు వాతావరణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. నేడు రేపు సాధారణ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్టు తెలిపారు.

జొన్నల కొనుగోళ్లలో టోకెన్ పద్ధతి తొలగించాలి


సారంగాపూర్, మే 15 : మండల కేంద్రంలో గల స్థానిక మార్కెట్‌యార్డ్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాలలో వెంటది వెంటనే కొనుగోళ్లు చేయాలని రైతులు పేర్కొంటున్నారు. టోకెన్ల పద్ధతిలో కొనుగోళ్లు చేయడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, కేంద్రాల్లోకి విక్రయించడానికి తీసుకువచ్చిన జొన్నలను కొనుగోలు చేయకపోవడంతో అకాల వర్షాలు కురియడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. ఇప్పటికైనా రైతులను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు స్పందించి జొన్నలకు టోకెన్ పద్ధతిని తొలగించి వెంటది వెంటనే కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

కుభీర్, మే 15 : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 11గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ తూం లక్ష్మీ అధ్యక్షతన నిర్వహించనున్న ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేధికలతో సకాలంలో హాజరు కావాలని సూచించారు.

కురిసిన వర్షం.. తడిసిన ధాన్యం

కుంటాల, మే, 15: మండల కేంద్రమైన కుంటాలతో పాటు కల్లూర్, అందకూర్, పెంచికల్‌పాడ్, లింబా (కే) గ్రామాలతో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల్లో వరి, మొక్కజొన్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఆయా గ్రామాల్లో గల కొనుగోలు కేంద్రాలు వర్షంతో తడిసి ముద్దవడంతో కేంద్రాలలోకి లారీలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దీంతో లారీలు రోడ్డుపై నిలవడంతో కొనుగోలు కేంద్రం నుంచి లారీ వద్దకు ట్రాక్టర్ల ద్వారా సొంత ఖర్చుతో బస్తాలను తరలించి లారీల్లో లోడ్ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అకాలవర్షాల వలన రైతులకు అదనపు ఖర్చు నెలకొందని రైతులు పేర్కొంటున్నారు. గత 15 రోజుల నుంచి అడప దడప వర్షాలు కురియడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.



కొనుగోలు కేంద్రంలోకి లారీ వెళ్లకపోవడంతో ట్రాక్టర్ల ద్వారా బస్తాలను తీసుకవచ్చి లోడ్ చేస్తున్న దృశ్యం